సాక్షి
అనకాపల్లి
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



వాగులు దాటి...
చింతలపూడి గిరిజన పంచాయతీలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. 8లో



దివ్యాంగుల ప్రతిభ
ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఆదివారం జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు జరిగాయి. 8లో



తాచేరు వంతెనపై రాకపోకలు
విజయరామరాజుపేట తాచేరు వంతెనపై సోమవారం సాయంత్రం నుంచి వాహనాలను అనుమతించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

27న అరకులోయలో అప్పన్న శాంతి కల్యాణం



ప్రచార రథం వద్ద వివరాలు తెలియజేస్తున్న సింహాద్రిమఠం గురుస్వామి సురేంద్రస్వామి

సింహాచలం: ఈనెల 27న అరకులోయలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి ఆదివారం తెలిపారు. రెండువేల మంది గిరిజన దీక్షాధారులు, భక్తులతో ఈ కల్యాణం జరుగుతుందని చెప్పారు. సింహాచలం దేవస్థానం సౌజన్యంతో సింహాద్రి మఠం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భాగంగా దేవస్థానానికి చెందిన ప్రచార రథం అరకులోయ వెళ్తుందని తెలిపారు. లోతేరు వెళ్లే మార్గంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శాంతికల్యాణం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఉదయం 9 గంటల నుంచి గిరిజన దీక్షాధారులు, భక్తులతో పద్మాపురం జంక్షన్ నుంచి ప్రచార రథంతో తిరువీధి నిర్వహించనున్నట్టు చెప్పారు.

అనకాపల్లి వాకర్స్ క్లబ్‌కు అవార్డులు



వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ నుంచి అవార్డు తీసుకుంటున్న శివ, వైద్యుడు నాయుడు

అనకాపల్లి : వాకర్స్ ఇంటర్నేషనల్ 32వ వార్షికోత్సవాలు విశాఖ ఏయూ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగాయి. అనకాపల్లి వాకర్స్ క్లబ్‌కు–2023కు గాను బెస్ట్ సర్వీస్, బెస్ట్ మెడికల్ క్యాంప్‌ల అవార్డులతో పాటు, క్లబ్‌కు రూ.5వేలు నగదు ప్రోత్సాహంతో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్లు ఎస్.రవీంద్ర, యు.శుభ చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ, సీనియర్ సభ్యుడు, వైద్యుడు డి.డి.నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా యల్లపు శివ మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో వార్షికోత్సవాలు జరిగినట్టు ఆయన చెప్పారు. 2023–24 ఏడాదికి గాను క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో ప్రధాన చర్చిల వద్ద పోలీసు బందోబస్తు



ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి: ప్రపంచానికి శాంతిని ప్రబోధించిన ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమైనదనీ, ప్రజలందరూ శాంతి, సామరస్యాలతో సుఖంగా జీవించాలని, ప్రశాంతమైన వాతావరణంలో క్రైస్తవ సోదరులు వేడుకలు నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రధానమైన చర్చిల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షునిగా ధర్మారావు



ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్

అనకాపల్లి: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కేఎల్ఎన్ ధర్మారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.దుర్గాప్రసాద్‌తో పాటు మరో 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకునిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు వ్యవహరించారు. ఈ కమిటీ 2025 వరకు మనుగడలో ఉంటుందన్నారు. జిల్లాలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు.



విద్యుల్లతలతో కాంతులీనుతున్న కశింకోటలోని ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చి

హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్

మానవాళికి శాంతి, కరుణ, ప్రేమ సందేశాలను అందించిన క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చిలను, క్రైస్తవుల గృహాలను క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు, విద్యుల్లతలతో అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.



యలమంచిలిలో అమ్మకానికి ఉంచిన క్రిస్మస్ స్టార్స్, ట్రీలు

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 72 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ
- లక్ష్యం 70 వేల మెట్రిక్ టన్నులు
- తొలివిడతలో 40 వేల మెట్రిక్ టన్నులు
- 20 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ
- నాతవరం, దేవరాపల్లిలో ప్రారంభమైన కొనుగోళ్లు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, పౌరసరఫరాల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సేకరిస్తున్నాయి.

మొదటి విడతలో 40 వేల మెట్రిక్ టన్నులు...

జిల్లాలో 72 రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలో 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో 40 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనుంది. ఇప్పటివరకూ 110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

3 లక్షల గోనె సంచులు సిద్ధం

జిల్లాలో 57 పీఏసీఎస్‌లు, 15 ఫార్మర్స్ ఆర్గనైజేషన్ల నుంచి సేకరించిన ధాన్యాన్ని 26 రైస్ మిల్లర్లకు రవాణా చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 250 ట్రాక్టర్లను ప్రభుత్వం సమకూర్చింది. సొంతంగా వాహనం సమకూర్చుకునే రైతులకు దూరాన్ని బట్టి ప్రభుత్వం అద్దె జమ చేస్తుందని అధికారులు తెలిపారు. ధాన్యం సేకరణకు 8 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటికే 3 లక్షల గోనె సంచులను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.



మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం (ఫైల్)

అదనపు సిబ్బంది నియామకం

ఆర్‌బీకే అసిస్టెంట్‌తో పాటు 196 మంది అదనపు సిబ్బందిని, 72 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించింది. 10 కిలోల ధాన్యం గ్రేడ్‌ను బట్టి, రూ.2,183, రూ.2,203 చొప్పున ప్రభుత్వం ధర చెల్లిస్తోంది.

కేటగిరీల వారీగా విభజన

ధాన్యం విక్రయించాలనే రైతులు వారి పరిధిలోని ఆర్‌బీకేలో పేరు నమోదు చేసుకోవాలి. ఆ రైతు నుంచి 24 గంటలలోపు కొనుగోలు చేస్తారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిన 21 రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

- ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు మూడు కేటగిరీలు విభజన చేస్తారు. రెండు వేల మెట్రిక్ టన్నులు దాటితే 'కేటగిరి–ఏ' లో సేకరిస్తారు. ఇలా ఆరు ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వెయ్యి నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల మధ్య ఉంటే కేటగిరి–బీ కింద 22 ఆర్‌బీకేలు, వెయ్యి మెట్రిక్ టన్నుల లోపు ఉంటే కేటగిరి–సిగా 44 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.
- జిల్లాలో దేవరాపల్లి, నాతవరం, గొలుగొండ, చోడవరం, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, మాడుగుల, కోటవురట్ల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతోంది. మిగతా మండలాల్లో రైతులు వరి పంటను కుప్పలుగా వేశారు. వారి సొంత అవసరాల కోసం నూర్పులు చేస్తున్నారు.





నాతవరం మండలం గునిపూడి గ్రామంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

అన్ని ఆర్‌బీకేల్లో కొనుగోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. పేరు నమోదు చేసుకున్న 24 గంటలలోపే కల్లాల వద్దకు అధికారులు వెళ్లి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన 21 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

– జయంతి, పౌర సరఫరాల శాఖ అధికారి, అనకాపల్లి జిల్లా

తాను చనిపోతూ.. ఆరుగురికి పునర్జన్మ

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ బ్రెయిన్‌డెడ్
- పుట్టెడు దుఃఖంలోను కుటుంబ సభ్యుల ఔదార్యం
- అవయవదానానికి సంపూర్ణ సహకారం



పూర్ణకుమారి(ఫైల్)

ఆరిలోవ: పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు చూపిన ఔదార్యం ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు వివరాలివి. అనకాపల్లి జిల్లా గవరపాలెం గ్రామానికి చెందిన వెలమ పూర్ణకుమారి(53) తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై ఈనెల 21న విశాఖ వస్తున్నారు. విశాఖ పోర్టు ఫ్లై ఓవర్‌పై వారి ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. దీంతో పూర్ణకుమారి తలకు తీవ్రగాయం కాగా ఆమెను రామ్‌నగర్‌లో కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. ఆమెకు శస్త్రచికిత్స చేసినప్పటికీ ఈనెల 23 రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. మంత్రి అమర్‌నాథ్ ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయదానం కోసం ప్రోత్సహించగా అంగీకరించారు. జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుతో మాట్లాడి అవయదాన ప్రక్రియ ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఆమె గుండె, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలు, లివర్ తొలగించి అవసరమైన వారి కోసం తరలించినట్లు డాక్టర్ రాంబాబు తెలిపారు. పూర్ణకుమారికి భర్త జగదీశ్వరరావు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తొలి సంధ్యవేళలో.. తెలి మంచుధారల్లో..



వంజంగిలో అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

- పర్యాటకుల జోష్
- టూరిస్టు స్పాట్లు కిటకిట
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

పాడేరు/అరకులోయ : జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. వరుస సెలవులు రావడంతో పలు ప్రాంతాల నుంచి టూరిస్టులు పెద్ద సంఖ్యలో వచ్చి సందడి చేశారు. తెల్లని మంచు పడుతుండగా ఆ చలిగిలిలో తెల్లవారుజాము నాలుగు గంటలకే పర్యాటల ప్రాంతాలకు చేరుకుని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించి, పరవశించిపోయారు. డుంబ్రిగుడ మండలంలో చాపరాయి, జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి, కొయ్యూరు మండలంలో చింతవానిపాలెం సమీపంలో ఉన్న జలపాతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో వాహనాలతో రావడంతో అరకు–పాడేరు జాతీయ రహదారి, జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి వెళ్లే రోడ్డులో కొంత ట్రాఫి క్‌కు అంతరాయం ఏర్పడింది.

జలపాతాల వద్ద అన్ని వయస్సుల వారు కేరింతలతో ఉల్లాసంగా జల కాలాడారు. రోజంతా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆటపాటలతో హాయిగా గడిపారు. అరకులోయ మండలంలో మాడగడ సన్ రైజ్ వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి అందాలు, మంచు సోయగాలను తిలకించి పర్యాటకులు పరవశించిపోయారు. సెల్ ఫోన్లలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. చింతపల్లి మండలంలో చెరువులవేనం పర్యాటకులతో కిటకిటలాడింది. లంబసింగి, తాజంగి తదితర ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారాయి.

కోవిడ్ అలర్ట్!

- కొత్త వేరియంట్ జేఎన్–1 వ్యాప్తిపై వైద్యశాఖ అప్రమత్తం
- యలమంచిలి సీహెచ్‌సీలో ప్రత్యేక వార్డు సిద్ధం
- మాక్‌డ్రిల్ నిర్వహించిన వైద్యులు, సిబ్బంది



ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు

యలమంచిలి రూరల్ : కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్–1 విస్తరిస్తోందన్న సమాచారం నేపథ్యంలో వైద్యశాఖ అప్రమత్తమైంది. మహమ్మారిని ఎదుర్కొనేందుకు యలమంచిలి సామాజిక ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సిద్ధమౌతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఈ ఆస్పత్రిలో కోవిడ్ చికిత్స సన్నద్ధత కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. సిబ్బందిలో ఒకరిని కోవిడ్ సోకిన రోగిగా భావించి ఆస్పత్రికి వచ్చిన దగ్గర్నుంచి, వార్డుకు తీసుకెళ్లడం, ప్రత్యేక వార్డులో పీపీఈ కిట్ వేసుకుని రోగికి చికిత్స అందజేయడం, అవసరమైతే ఆక్సిజన్ ఎలా అందించాలి..ఏఏ మందులు ఎలా ఇవ్వాలో.. మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రి మొదటి అంతస్తులో 10 బెడ్‌లతో కోవిడ్ ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. వీటిలో 8 ఆక్సిజన్ బెడ్‌లు ఉన్నాయి. ఆస్పత్రిలో 8 పెద్ద ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధం చేశారు. ఒక్కో సిలిండర్‌తో ఒక రోగికి రెండ్రోజుల పాటు అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ సపోర్టుతో చికిత్స అందజేయడానికి వినియోగించవచ్చని వైద్యులు తెలిపారు. కోవిడ్ అనుమానితులకు వైద్య పరీక్షలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించుకున్నారు.

కోవిడ్ జాగ్రత్తలు తీసుకోవాలి..

కోవిడ్ కొత్త వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని యలమంచిలి సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్ సుభాష్ తెలిపారు. కోవిడ్ చికిత్సకు అవసరమైన మందులు, గ్లౌజులు, శానిటైజర్లు, పీపీఈ కిట్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, ఆక్సిజన్, సిలిండర్లు, వెంటిలేటర్లు వంటి ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. జ్వరం, దగ్గు, మొదలైన తేలికపాటి లక్షణాలతో ఉన్న వ్యక్తులు ఇంట్లో ఒంటరిగా ఉండాలని, లక్షణాలు తగ్గేవరకు ఇతరులతో దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



కోవిడ్ సన్నద్ధత మాక్‌డ్రిల్‌లో భాగంగా వార్డులో రోగికి చికిత్స అందజేస్తున్న సిబ్బంది

మరో 11 మందికి కరోనా

మహారాణిపేట(విశాఖ): మరో 11 మందికి కరోనా సోకింది. దీంతో కేసుల సంఖ్య 18కి చేరుకుంది. ఈ 11 మంది నుంచి నమూనాలు సేకరించి... జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 34 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో 11 మందికి కరోనా నిర్ధారణ అయినట్లు చెప్పారు. కేజీహెచ్ నిర్వహించిన పరీక్షల్లో 8 మందికి, ప్రైవేట్ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. వీరిలో కైలాసపురం, ఆనందపురం, కంచరపాలెం, రామ్‌నగర్, సబ్బవరం, డెంకాడ(విజయనగరం), శ్రీకాకుళం, అనపర్తికి చెందిన ఒక్కొక్కరు, అనకాపల్లికి చెందిన ముగ్గురు ఉన్నారు.

బొగ్గు నిల్వలతో పోర్టు హౌస్‌ఫుల్

విశాఖపట్నం పోర్టు.. బొగ్గు నిల్వలతో నిండిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 1.4 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు పేరుకుపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి దిగుమతి చేసుకున్న కోల్ ధరతో పోలిస్తే.. దేశీయ బొగ్గు తక్కువ ధరకే లభిస్తోంది. దీంతో విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మరో రెండు రోజుల్లో ఇంకో లక్ష టన్నులు వచ్చే అవకాశం ఉండటంతో.. ఏం చేయాలో తెలీక.. అటు ట్రేడర్స్, ఇటు పోర్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

– సాక్షి, విశాఖపట్నం



- విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేయని సంస్థలు
- దేశీయ బొగ్గుతో పోలిస్తే ధర దాదాపు రెట్టింపు ఉండటమే కారణం
- ఇప్పటికే పోర్టులో 1.4 మిలియన్ టన్నుల నిల్వ
- రెండు రోజుల్లో లక్ష టన్నులతో రెండు కార్గో షిప్స్ వచ్చే అవకాశం

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర సంస్థలకు అవసరమైన థర్మల్, కోకింగ్, స్టీమ్ కోల్‌ని విశాఖపట్నం ట్రస్టు హ్యాండ్లింగ్ చేస్తుంటుంది. ఏటా సుమారు 2 మిలియన్ టన్నుల థర్మల్, 7 మిలియన్ టన్నుల కోకింగ్, 10 మిలియన్ టన్నుల స్టీమ్ కోల్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు జరుగుతుంటాయి. మొత్తంగా పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌లో కోల్ వాటా దాదాపు 25 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. విశాఖకు చెందిన కొందరు వెండర్స్.. ఇక్కడ అవసరాలకు అనుగుణంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటారు. వాటిని పోర్టులో హ్యాండ్లింగ్ చేసి.. ఆయా పరిశ్రమల డిమాండ్ మేరకు విక్రయిస్తుంటారు. అయితే కొద్ది నెలలుగా పోర్టులో కోల్ నిల్వలు పెరిగిపోతున్నాయి.

దేశీయ బొగ్గే మేలని..

ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, చైనా దేశాల నుంచి పోర్టుకు స్టీమ్ కోల్ దిగుమతి అవుతుంటుంది. ఇందులో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న బొగ్గు అత్యంత నాణ్యమైంది కావడంతో దానికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. విశాఖ, ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది ట్రేడర్స్ వీటిని ఆయా దేశాల్లో కొనుగోలు చేసి.. ఇక్కడి తీసుకొస్తుంటారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్టీమ్ కోల్ ధర పెరిగింది. దీంతో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కోల్ ధర విశాఖ పోర్టుకి చేరుకునే సరికి టన్నును రూ.9000 నుంచి రూ.9500 వరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కోల్ ఇండియా సంస్థ నేరుగా విక్రయాలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్డర్ పెడితే.. కోల్ ఇండియా సంస్థే స్టీమ్ కోల్‌ను తీసుకొస్తోంది. దీంతో దేశీయ బొగ్గు టన్ను ధర విశాఖ చేరే సమయానికి రూ.5,200 నుంచి రూ.5,800 వరకు పలుకుతోంది. విదేశీ బొగ్గు ధరతో పోలిస్తే దాదాపు రూ.4000 వరకు తక్కువ. ఈ పరిస్థితుల్లో బొగ్గు అవసరమైన సంస్థలు దేశీయ బొగ్గు కొనుగోలుకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో విదేశాల నుంచి వస్తున్న స్టీమ్ కోల్ నిల్వలు పోర్టులో పేరుకుపోతున్నాయి. ఇతర దేశాల నుంచి కోల్ తీసుకురావాలంటే 3 నుంచి 6 నెలల ముందుగానే ట్రేడర్లు ఆర్డర్లు పెట్టాలి. దానికనుగుణంగా కార్గోషిప్స్ ఇక్కడికి బయలుదేరుతాయి. ఇక్కడ కొనుగోళ్లు జరగకపోతున్నా.. వాటిని ఆపలేని పరిస్థితి నెలకొంది. దీంతో నౌకల నుంచి కోల్‌ను దిగుమతి చేసి పోర్టులో నిల్వగా ఉంచేస్తున్నారు.

1.4 మిలియన్ టన్నుల నిల్వలు

ఇప్పటివరకు పోర్టులో 1.4 మిలియన్ టన్నుల ఇంపోర్టెడ్ స్టీమ్ కోల్ నిల్వలు పేరుకుపోయాయి. గత నెల రోజులుగా ట్రేడర్లు ఎవరూ ఆర్డర్లు పెట్టకపోవడంతో ఆయా దేశాల నుంచి బొగ్గు దిగుమతి ఆగిపోయింది. గతంలో పెట్టిన ఆర్డర్ల మేరకు రెండు నౌకల నుంచి దాదాపు లక్ష టన్నుల స్టీమ్ కోల్‌తో ఈ వారంలో పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం.ఇప్పటికే పోర్టంతా బొగ్గుమయం అయిపోగా.. ఇప్పుడు వస్తున్న షిప్స్ నుంచి ఎలా దిగుమతి చేసుకోవాలి, ఎక్కడ నిల్వ ఉంచాలంటూ అటు ట్రేడర్లు, ఇటు పోర్టు అధికారులు ఆలోచిస్తున్నారు. కోల్ ఇండియాలో నిల్వలు అయిపోయేంత వరకు ఈ దుస్థితి తప్పదని భావిస్తున్నారు.



పేరుకుపోయిన బొగ్గు నిల్వలు

క్లుప్తంగా

'పుంగనూరు చరిత్ర-నాతో నేను' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ లజపతిరాయ్, సాహితీవేత్త సూర్యారావు

దాబాగార్డెన్స్: చరిత్రతోనే రెండు ప్రాంతాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ప్రొఫెసర్ లజపతిరాయ్ అన్నారు. డాక్టర్ ఎం రామచంద్రారెడ్డి రచించిన 'పుంగనూరు చరిత్ర-నాతో నేను' పుస్తకావిష్కరణ ఆదివారం దాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. రచయిత, సాహితీవేత్త సూర్యారావు, డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ లక్ష్మి సంగీత దంపతులతో కలిసి ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని కళలు, పర్యాటకం, ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ ఓ పుస్తకం తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ చైతన్యరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాఖపట్నంకు ఓ చరిత్ర ఉందన్నారు. తాను విశాఖలోనే వివాహం చేసుకున్నానని, మెడికల్ పీజీ ఇక్కడే చేశానని చెప్పారు. 1976లో మెడిసిన్ పూర్తి చేసిన తన తండ్రి రామచంద్రారెడ్డి ఎన్నో పుస్తకాలు రాసినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రచురణ కాలేదన్నారు. శ్రీశ్రీ రాసిన పుస్తకంలో తన తండ్రి రాసిన కవిత ఉందన్నారు.

రోటరీ కప్ గోల్ఫ్ విజేత శ్రీనివాస్

విశాఖ స్పోర్ట్స్: రోటరీ గోల్ఫ్ కప్ విన్నర్‌గా కె.శ్రీనివాస్ (33 పాయింట్లతో) ఓవరాల్ నిలిచాడు. 228 యార్డ్స్ హిట్‌తో కె.వి.ఎస్.రామరాజు లాంగెస్ట్ డ్రైవ్ చేయగా 2.7 ఫీట్‌తో క్లోజెస్ట్ పిన్‌గా ఎం.రఘురామ్ నిలిచాడు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఈపీజీసీ ఆదివారం గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన పోటీల్లో 108 గోల్ఫర్లు పోటీపడ్డారు. గోల్డ్ డివిజన్‌లో కెప్టెన్ హేమంత్‌కుమార్ విజేతగా నిలవగా కె.ఎస్.ఆర్.కె.రాజు రన్నరప్‌గా నిలిచారు. సిల్వర్ డివిజన్‌లో కృష్ణకుమార్ సింగ్ విజేతగా వి.అమర్‌కాంత్ రన్నరప్‌గా నిలిచారు. ఎన్.అప్పారావు, టి.కె.రాజు ఈ విభాగాల్లో చక్కటి ప్రతిభ చూపారు. బ్రాంజ్ డివిజన్ విజేతగా ప్రణవ్ చందల్, రన్నరప్‌గా కిరీట్ వెంకట్ నిలిచారు. సీనియర్ డివిజన్ విన్నర్‌గా ఎం.బి.పాత్రుడు, రన్నరప్‌గా జి.ఆర్.జి.రెడ్డి నిలవగా మహిళల విభాగంలో ఎం.సరిత విజేతగా, ఎం.పావని రన్నరప్‌గా నిలిచారు. పోలియో నిర్మూలన ఫండింగ్ కోసం ఈ పోటీలు నిర్వహించగా వచ్చిన ఐదు లక్షల చెక్కును వినియోగించనున్నారు. విజేతలకు సంధ్యామెరైన్స్ ఎండీ కె.వి.ప్రసాద్ జ్ఞాపికలు అందించారు. రోటరీ జిల్లా గవర్నర్ వెంకటసుబ్బారావు, డైకిన్ కిషోర్‌కుమార్, మధుబాబు పాల్గొన్నారు.

వాగులు దాటి... కొండలు, గుట్టలు ఎక్కి...!

- 5 కి.మీ మేర అటవీ ప్రాంతంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యటన
- చింతలపూడి శివారు బోడిగరువు, నేరెళ్లపూడి గిరి గ్రామాల సందర్శన
- స్వాతంత్య్రం వచ్చాక ఆ గ్రామాల్లో పర్యటించిన తొలి ప్రజాప్రతినిధిగా బూడి



బోడిగరువు గిరిజన ప్రాంతంలో మోకాలి లోతు నీటిలో గెడ్డను దాటుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి గిరిజన పంచాయతీలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. సమ్మెద వంతెన వరకు తన వాహనంలో చేరుకున్న ఆయన అక్కడి నుండి 5 కి.మీ మేర దూరంలో ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడికి పాదయాత్ర (కాలినడకన) చేసి చేరుకున్నారు. ఆయా గిరిజన గ్రామాలకు రూ.2 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కనీసం కాలిబాట లేని మార్గంలో ప్రయాణించి మూడు చోట్ల నడుమ లోతు నీటిలో వాగులు దాటి అతి కష్టం మీద చేరుకున్నారు. స్వాతంత్య్రం వచ్చాక ఏ ప్రజాప్రతినిధి తమ గ్రామానికి రాలేదని, తమ పర్యటనతో తమ కష్టాలు తీరినట్లేనని స్థానికులు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఇదే రోడ్డు నిర్మిస్తామని టీడీపీ నాయకులు తమను మోసగించారని, తాము అడగకుండానే రోడ్డు పనులు ప్రారంభించి తమ గ్రామానికి విచ్చేయడం ఆనందంగా ఉందని గిరిజనులు సంతోషం వెలిబుచ్చారు. గిరిజనులను ఆత్మీయంగా పలకరిస్తూ తమ గ్రామాలలోని సమస్యలన్నింటిని అంచెలంచెలుగా పర్యటిస్తానని డిప్యూటీ సీఎం వారికి భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం తమ గ్రామానికి విచ్చేసి రోడ్డు పనులు ప్రారంభించడంతో బోడిగరువు, నేరెళ్లపూడిలో పండగ వాతావరణం నెలకొంది. జీవితాంతం సీఎం జగన్ వెంటే తామంతా ఉంటామంటూ ముక్త కంఠంతో స్పష్టం చేశారు. పర్యటనలో డిప్యూటీ సీఎం వెంట జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, మండల యువజన అధ్యక్షుడు సూరినాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వి.సింహాచలంనాయుడు, చింతలపూడి, తామరబ్బ సర్పంచ్‌లు దొమ్మంగి బోడమ్మ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, లాలం జానకీరామ్, జేసీఎస్ మండల కన్వీనర్ రమణ, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, దొమ్మంగి శ్రీనివాసరావు, గుమ్మడపు మహేష్, కడారి రాజు, ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, ఎంఈవో-2 వి. ఉషారాణి పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది..



స్వాతంత్య్రం వచ్చాక ఇప్పటి వరకు ఏ ప్రజాప్రతినిధి మాగ్రామాల వైపు కన్నెత్తి చూడలేదు. మా పూర్వీకుల నుంచి తమ గ్రామాలకు రోడ్డు నిర్మించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. తొలిసారి డిప్యూటీ సీఎం హోదాలో బూడి ముత్యాలనాయుడు మాగ్రామానికి వచ్చి రోడ్డుకు రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభించడం ఆనందంగా ఉంది.

– పోయిరి అచ్చియ్యమ్మ, గిరిజన మహిళ, బోడి గరువు గ్రామం

ఎన్నడూ ఊహించలేదు.



తాను బతికి ఉండగా తమ గ్రామానికి రోడ్డు చూస్తానని ఊహించలేదు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో ఎన్నో ఏళ్ల నాటి రోడ్డు కల నెరవేరుతుంది. ఎంతో కష్టపడి తమ గ్రామానికి వచ్చి కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్న ఏకైక నాయకుడు ముత్యాలనాయుడు మాత్రమే. అడగకుండానే మా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సైతం భరోసా ఇవ్వడం సంతోషదాయకం.

–పి. చిన్నయ్య, గిరిజనుడు, బోడిగరువు గ్రామం

28న 'ఆడుదాం ఆంధ్రా' బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ఈ నెల 28న అనకాపల్లిలో జరిగే 'ఆడుదాం ఆంధ్రా' బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని అందించారని తెలిపారు. 28న ఉమ్మలాడ జంక్షన్ నుంచి వెళ్లి బైపాస్‌లోని మహానేత రాజన్న విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. అక్కడ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పెంటకోట కన్వెన్షన్ హాలు వద్ద సమావేశం జరుగుతుందన్నారు. వేలాది బైక్‌లతో ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, యువ క్రికెటర్ అంబటి రాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అతిథులుగా హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పాలసంఘం అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, నూకరాజు, గంగప్పలనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీటీసీ వీరునాయుడు, నాగేశ్వరరావు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

5న దళితుల రాష్ట్ర సమావేశం

బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దేవానందం



విలేకరులతో మాట్లాడుతున్న దేవానందం

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్త దళితులతో జనవరి 5న భారీస్థాయి సమాశం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దేవానందం అన్నారు. స్థానిక చదువులవారివీధి బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో దళితులకు రూ.కోట్లలో నిధులు విడుదల చేసిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి, ఇప్పటి వరకూ దళితులకు కేంద్రం ఏ మేరకు నిధులు విడుదల చేసిందీ గణాంకాలు వెల్లడించనున్నట్టు పేర్కొన్నా రు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ



సైకిల్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆడారి కుమార్, కాంద్రేగుల శ్రీరామ్

అనకాపల్లి : దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనే పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయ భాస్కర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరయాదవ్ (వీరబాబు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా స్థాయి ఆటల పోటీలను విద్యాశాఖ ఏడీ ఆడారి రవికుమార్, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాంద్రేగుల శ్రీరామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అంగవైకల్యం, అంధులు, బధిరులు, మానసిక దివ్యాంగులు వారికి ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, జావెలిన్‌త్రో, డిస్క్‌త్రో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ వంటి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ క్రీడాకారులకు అడిషనల్ ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది కనిశెట్టి సురేష్‌బాబు, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, మాణిక్యాలరావు, వియ్యపు రాజు, సంక్షేమ సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

ఇప్పటి వృద్ధులమే.. ఆనాటి చిన్నారులం



1968-73 బ్యాచ్ విద్యార్థులు

- కల్యాణపులోవ వేదికగా పూర్వ విద్యార్థుల సందడి
- 50 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక

రావికమతం: ఏరా.. ఎలా ఉన్నావ్, ఏమిట్రా మరీ గుర్తు పట్టలేనంతగా మారిపోయావ్.. నువ్వేనా నమ్మలేకున్నానురా! అంటూ.. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఏం చేస్తున్నావ్, పిల్లలేం చేస్తున్నారు? మనములు, ముని మనములు ఉన్నారా? వారేం చేస్తున్నారు, ఫోన్ నంబర్ ఇవ్వు అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆరుపదుల వయసులోనూ నాటి చిన్నపిల్లల వలే కేరింతలు కొట్టారు. ఆదివారం కల్యాణపులోవ వేదికగా సందడి చేశారు. వారెవ్వరో కాదు కొత్తకోట హైస్కూల్‌లో 1968–73 మధ్య 6 నుంచి 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు. గ్రామానికి చెందిన రేజేటి వేణు, కేదారిశెట్టి సన్యాసిశెట్టి, గర్రెడ్డి త్రినాథరావు, అప్పలనాయుడు, మైచర్ల రామునాయుడు, శెలా ప్రకాశరావు, పెంటపాటి రమణాజీ, పులిగా అచ్యుతరావు, ఒమ్మవరం గ్రామానికి చెందిన గళ్లా చిన్నంనాయుడు, కంచుగుమ్మల గ్రామానికి చెందిన అప్పలనాయుడు, బెల్లాల సూర్యారావు, వెల్లంకి చిన్నంనాయుడు, రమాకుమారి, చినతల్లి, లక్ష్మీదేవి తదితర వంద మంది వరకూ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. రెండు నెలలుగా మిత్రుల ఫోన్ నంబర్లు సేకరించి సమాచారం అందించి ఒక వేదిక మీదకు చేరుకుని తమ ఆనందాలను పంచుకున్నారు. సహ పంక్తి భోజనాలు చేశారు. మిత్రుల కష్టసుఖాల్లో సమాచారం అందించుకోవాలని నిర్ణయించుకున్నారు. నేడు స్కూల్ చైర్మన్ అడ్డూరు నానాజిని ఘనంగా సన్మానించారు.

డీసీసీబీల ద్వారా రుణాలు అందించాలి

ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందప్రసాద్

రావికమతం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రుణాలందించి చేనేత సొసైటీలను ఆదుకోవాలని, వస్త్ర ఉత్పత్తికి అవసరమయ్యే ముడి సరుకులు, రంగు రసాయనాలు ఉచితంగా అందించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్ అన్నారు.ఆ సంఘం రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం కొత్తకోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నిరుద్యోగంతో ఉన్న చేనేత కార్మికుల పిల్లలకు నూతన టెక్నాలజీతో కూడిన శిక్షణ ఇప్పించి ప్రభుత్వం ఉపాధి చూపాలన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని, వేతనాలు బ్యాంకుల ద్వారా త్వరితగతిన అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పుష్ప రాజారావు, ఏపి రాష్ట్ర అధ్యక్షుడు శివరామ ప్రసాద్, కార్యదర్శి రమణ మహేష్, గౌరవాధ్యక్షుడు నాళి అప్పారావు, చేనేత విభాగం కార్యదర్శి పప్పు వెంకట రమణ పాల్గొని రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు గూర్చి వివరించారు. చేనేత కార్మికులకు, రావికమతం మండలంలో టైలర్లకు సొసైటీల ద్వారా ఆప్కో సంబంధిత అధికారులతో చర్చించి 50 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్లు వచ్చేలా చూడాలని ఒక వినతి పత్రాన్ని మండల నాయకులు చల్లా సత్యారావు, బేతా రాజారావు, వైఎస్ఆర్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బేతా పాండు, శెలా నాగేశ్వరరావు సభలో అందించారు.

నేటి నుంచి తాచేరు వంతెనపై రాకపోకలు



తాచేరు నదిలో రాయి, గొట్టాలు వేసి చేస్తున్న లెవెలింగ్ పనులు

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామాజుపేట తాచేరు వంతెనపై నుంచి సోమవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించనున్నారు. బ్రిటీష్ కాలం నాటి ఈ వంతెన శిథిలావస్థకు చేరి వారం రోజుల క్రితం కూలిపోయింది. దీంతో భీమునిపట్నం- నర్సీపట్నం రోడ్డులో విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారు. వంతెనకు ఎడమ వైపు తుప్పలు, చెట్లు తొలగించారు. రాయి, సిమెంట్ గొట్టాలుతో పాటు గ్రావెల్ వేసి రోలింగ్ పనులు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నానికి డైవర్షన్ రోడ్డు పనులు పూర్తవుతాయని, సాయంత్రం నుంచి వాహనదారులకు అనుమతిస్తామని అనకాపల్లి ఆర్అండ్‌బీ డీఈ ధనుంజయ్, చోడవరం జేఈ సత్యప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలిపారు. వీరి పర్యవేక్షణలో డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి ట్రాఫిక్ నిలిచిపోకుండా తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రికార్డు కోసం.. సాధన చేసి..

- యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కోసం ఓం శ్రీ యోగా సంస్థ ప్రయత్నం
- 230 మందితో 216 రౌండ్లలో సూర్యనమస్కారాల సాధన
- జనవరి 9న గాదిరాజు ప్యాలెస్ వేదికగా ప్రధాన కార్యక్రమం



ఆసనాలు వేస్తున్న యోగాభ్యాసకులు

సీతమ్మధార: విభిన్న రంగాల్లో రికార్డులతో ఖ్యాతిగాంచిన విశాఖ నగరం సరికొత్త రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. 230 మంది సాధకులు, 216 రౌండ్ల సూర్య నమస్కారాలతో.. యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కోసం 'ఓం శ్రీ యోగా సంస్థ' దరఖాస్తు చేసింది. ఇందులో భాగంగా సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం డెమో నిర్వహించింది. ఉదయం ఐదు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రెండు గంటల పాటు సాగింది. యోగాభ్యాసకులు 216 రౌండ్స్‌లో 2,592 సార్లు సూర్య నమస్కారాలు చేశారు. మరో 50 మంది 108 రౌండ్లలో సూర్య నమస్కారాలు చేసినట్లు ఓం శ్రీ యోగా సంస్థ ఫౌండర్ చైర్మన్ చిలక వెంకట రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల యోగాభ్యాసకులు హాజరైనట్లు వెల్లడించారు. జనవరి 9న గాదిరాజు ప్యాలెస్ వేదికగా ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్య కోసం తమ సంస్థ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి రోజూ ఉదయం ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 93333 33344ను సంప్రదించాలని కోరారు.

పలు రైళ్ల దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట-బల్లార్షా సెక్షన్ హసన్‌పర్తి రోడ్-ఉప్పల్ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆదునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ కింది రైళ్లు దువ్వాడ-విజయవాడ-వరంగల్-బల్హార్షా మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో వయా విజయనగరం-రాయగడ-టిట్లాఘడ్- రాయ్‌పూర్- నాగ్‌పూర్ మీదుగా నడుస్తాయి.

- జనవరి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం-న్యూఢిల్లీ -విశాఖపట్నం (20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్
- జనవరి 4, 11 తేదీల్లో విశాఖపట్నం-గాంధీదాం(20803) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న గాంధీదాం-విశాఖపట్నం (20804) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 1, 5, 8, 12 తేదీల్లో విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3, 7, 10 తేదీల్లో హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న పూరీ -ఓఖా(20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3,10 తేదీలలో ఓఖా-పూరీ (20820) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు.

కోరాపుట్-రాయగడ్ లైన్‌లో..

వాల్తేర్ డివిజన్ దమన్‌జోడి-బాయ్‌గుడ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న రెండో లైన్ సంబంధిత పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. జనవరి 1,5 తేదీల్లో విశాఖపట్నం-కోరాపుట్(18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, జనవరి 2,6 తేదీల్లో కోరాపుట్-విశాఖపట్నం (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

సందడిగా క్షత్రియ పరిషత్ వన సమారాధన



క్షత్రియ పరిషత్ నూతన కమిటీ



క్షత్రియుల్ని సత్కరిస్తున్న దృశ్యం

మాకవరపాలెం: గిడుతూరులో క్షత్రియ పరిషత్ వన సమారాధాన కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ క్షత్రియ పరిషత్ నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణపతిరాజు సూర్య బంగార్రాజు, కార్యదర్శిగా బుద్దరాజు చక్రపాణి రాజు, కోశాధికారిగా జంపన నాగేంద్రరాజు, గౌరవాధ్యక్షుడిగా డీసీసీబీ మాజీ చైర్మన్ సాగి రామ చంద్రరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా సాగి సత్యనారాయణరాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. క్షత్రియుల అభ్యున్నతికి కృషి చేస్తామని అధ్యక్షుడు బంగార్రాజు పేర్కొన్నారు. అల్లూరి నడయాడిన మంప, రాజేంద్రపాలెం, చింతపల్లి పోలీసు స్టేషన్ వంటి చారిత్రక కట్టడాలు ప్రభుత్వ సహకారంతో ఆధునికీకరించేందుకు కృషి చేస్తామన్నారు. గంటం దొర వారుసులకు 11 ఇళ్లు నాగార్జున కన్‌స్ట్రక్షన్ ద్వారా కట్టిస్తున్నామన్నారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని శిల్పా లేఅవుట్‌లో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియ మహిళల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్షత్రియుల్లో ఇటీవల ఉన్నత పదవులు అలంకరించిన వారిని సత్కరించారు. రాజపుత్ర సమాజ్ అధ్యక్షుడు దంతులూరి రాజబాబు, ప్రధాన కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, సీఐడీ అడిషనల్ ఎస్పీ పిన్నమరాజు రవి వర్మ, చెరుకూరి వెంకటపతి రాజు, మండపాటి సునీత, దాట్ల సత్యనారాయణ రాజు, శిరీష, శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బియ్యం, రగ్గుల పంపిణీ



నిరుపేదలకు బియ్యం, రగ్గులను అందిస్తున్న కొణతాల లక్ష్మీపార్వతి

అనకాపల్లి: సేవాభావం మనిషిని ఉత్తమ మార్గంలో నడిపిస్తుందని కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి అన్నారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీలో గ్రీన్‌క్లబ్, కశింకోట ఎస్‌ఐ జక్కుల నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో నిరుపేదలకు ఆదివారం బియ్యం, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా డిసెంబర్లో 150 మంది నిరుపేదలకు 5 కేజీల బియ్యం, ఓ రగ్గు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శిష్టా తిమ్మరాజు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని, ప్రతి ఒక్కరూ తనకు తోచిన రీతిలో సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, సభ్యులు బేతాళం శేషసాయి, ఎస్.సత్తిబాబు, కర్రి హనుమంతరావు, యల్లపు సూరిఅప్పారావు, పాలమరిశెట్టి విజయ, పెంటకోట భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లి: ఆటోలో ఓవర్ లోడ్ ప్రయాణాలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువని డీఎస్పీ వి.సుబ్బరాజు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద కశింకోట, కుంచంగి, కూండ్రం ఆటో స్టాండ్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులపైకి వచ్చే సమయంలో పెద్దవాహనాలను గమనించుకుంటూ రావాలన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించడం వలన మీతోపాటు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. వాహన రికార్డులతోపాటు యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులు మాత్రమే ఆటోలు నడపాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్‌ఐ జె.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లర దుకాణంలో మద్యం పట్టివేత

కశింకోట: కశింకోటలోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద చిల్లర దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 12 క్వార్టర్ సీసాలను ఆదివారం పట్టుకున్నట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. కంచిపాటి జగన్నాథం చిల్లర దుకాణంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆక్వామెన్(తెలుగు): రాజా	
సలార్	: సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
హాయ్ నాన్న	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 262 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 215 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



క్రిస్మస్ శోభను సంతరించుకున్న ఆర్‌సీఎం చర్చి



విద్యుత్ అలంకరణతో ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి



ఆర్‌సీఎం చర్చిలో పూల అలంకరణ



తుమ్మపాలలో అందంగా ముస్తాబు చేసిన చర్చి

నీ ఆరాధన.. మా హృదయాలాపన

- ఊరూవాడా క్రిస్మస్ సందడి
- విద్యుత్ దీపాలంకరణలో చర్చిలు

ప్రపంచ వ్యాప్తంగా ఒకే తేదీ, ఒకే సమయంలో అత్యధికులు చేసుకునే పండగ క్రిస్మస్. ఏటా డిసెంబర్ 25న క్రీస్తు జన్మదిన వేడుకలను ప్రపంచమంతా ఘనంగా నిర్వహిస్తారు. సత్యం, శాంతి, దయ, త్యాగం, కరుణ, ప్రేమ.. వంటి సందేశాలతో క్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. ఈ పర్వదినం సందర్భంగా ఊరూవాడా చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో నెల రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి.

తుమ్మపాల: క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకుని పట్టణంలోని చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచే ప్రార్థనలు, వివిధ కార్యక్రమాలకు చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ప్రముఖంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని కథోలిక చర్చి, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్‌సీఎం(సెంటినరీ బాప్టిస్ట్) చర్చిలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. క్రిస్మస్ రోజున వీరి సంఖ్య దాదాపు 25 వేలు వరకు ఉంటుంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ సందర్భంగా గత కొన్ని రోజులుగా చర్చిలను రంగులేసి, విద్యుత్ లైటింగ్‌తో ముస్తాబు చేశారు. క్రిస్మస్ ట్రీస్, స్టార్‌లను అలంకరించారు.

కశింకోట: మండలంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలను సిద్ధమయ్యాయి. విద్యుద్దీపాల వెలుగులతో తళతళలీనుతున్నాయి. సోమవారం క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రార్థనలు, ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించి ఆనందోత్సాహాలతో జరుపుకోవడానికి క్రైస్తవులు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆంధ్ర కల్వరీ సెంటినరీ బాప్టిస్టు చర్చిని, క్రిస్మస్ చెట్టును విద్యుద్దీపాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. గవరపేటలోని చర్చి, హౌసింగ్ కాలనీ వద్ద షాలెం మందిరంలను విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, విసన్నపేట, అచ్చెర్ల, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జి.భీమవరం, చింతలపాలెం, నరసింగబిల్లి, సోమవరం, ఏఎస్ పేట, నూతలగుంటపాలెం, ఏనుగుతుని తదితర గ్రామాల్లోని చర్చిలను కూడా క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించడానికి సిద్ధం చేశారు.



కశింకోటలోని ఆంధ్ర కల్వరీ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ ట్రీకి విద్యుత్ లైట్లతో అలంకరణ



కశింకోటలోని గవరపేటలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ



కథోలిక చర్చికి విద్యుత్ లైటింగ్

జెడ్పీ కోఆప్షన్ సభ్యుడి కార్యాలయ ప్రారంభం నేడు

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి శారదానగర్ మెయిన్ రోడ్డులో వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడి నూతన కార్యాలయాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతిలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోషఫ్) ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

మంత్రి అమర్‌నాథ్‌తో మండల యూత్ అధ్యక్షులు



మంత్రి అమర్‌నాథ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ, త్రినాథ్

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణ, గవరపాలెం యువజన విభాగాల అధ్యక్షులు ఉగ్గిన నూకఅప్పారావు సత్యనారాయణ, వేగి త్రినాథ్‌లు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను విశాఖలోని మింది గ్రామంలో ఉన్న ఆయన స్వగృహంలో ఆదివారం కలిసి శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తివంచన లేకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన వ్యక్తులకు తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మాడుగుల జెడ్పీ హైస్కూల్ 1976-77 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



ఏఎంఏఏ హైస్కూల్ 1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

తుమ్మపాల: వారంతా మాడుగుల జిల్లా పరిషత్ హైస్కూల్లో 1976-77 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్నారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నప్పుడు అంతా కలిసి పిక్నిక్‌కు తొలిసారి వెళ్లారు. అప్పుడు మొదలైన మాడుగుల మిత్ర బృందం ఆత్మీయ కలయిక, వన సమారాధన నిరాటంకంగా కొనసాగుతోంది. ప్రస్తుతం వారి 48వ ఆత్మీయ సమ్మేళనానికి పట్టణంలోని పీవీజేఆర్ రిసార్ట్ వేదికయింది. వారంతా దాదాపు షష్టిపూర్తి దాటిన వారే. వృత్తి, ఉద్యోగాల నిమిత్తం ఎల్లలు దాటినా, ఏటా తమ మిత్రుల్ని కలుసుకునేందుకు తప్పక వస్తూ.. స్నేహమాధుర్యాన్ని చాటుకుంటున్నారు. ఎన్ని పనులున్నా, వాటిని వదులుకుని మరీ వచ్చి, రోజంతా స్నేహితులతో ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, పరస్పర యోగక్షేమాలు తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సందడి చేశారు. వీరిలో డి.సాయిబాబా అనకాపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా, వి.వి.రాజారావు విజయవాడ సైనిక సంక్షేమాధికారిగా, జె.డి.చక్రవర్తి హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నారు. జె.శ్రీనివాసరావు టెలిఫోన్ అధికారిగా, విశ్వనాథం, ఏఎస్‌డ బ్ల్యూవోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. వీరితోపాటు వివిధ హోదాల్లో ఉన్న కె.సత్యారావు, ఏబీ ప్రసాద్, పి.ప్రకాశందొర, బి.అప్పలరాజు, ఎ.లక్ష్మణరావు, ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం తమకు ఎంతగానో స్ఫూర్తినిస్తుందని డీపీఆర్వో సాయిబాబా అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడ ఉన్నప్పటికీ, ఎవరింట్లో శుభకార్యం జరిగినా అంతా కలుస్తామని తెలిపారు.

అనకాపల్లి: స్థానిక ఏఎంఏఏ హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ కలియక స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకుని 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ పేరిట వేడుకల్ని నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకుని పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను, ప్రస్తుత ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, అప్పారావు, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో 1994-95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సమీపంలోని తోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సాయంత్రం వరకు ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తమ సహచర విద్యార్థులు ముగ్గురు మృతి చెందడంతో వారి కుటుంబాలకు రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం అందించారు. అంతా సహపంక్తి భోజనాలు చేశారు. చివరిగా ఫోటోలు దిగి, జ్ఞాపకాలను పదిలపరచుకున్నారు. రేజేటి మారుతి, కె.సతీష్, రెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



డీపీఎన్ హైస్కూల్ 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ముగిసిన కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవానికి విచ్చేసిన జనం



స్టేజ్‌పై డ్యాన్స్ బేబీ డ్యాన్స్ దృశ్యం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం రాత్రి ముగిసింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా విచ్చేసిన ప్రజలు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని, నేలవేషాలు, స్టేజ్‌ప్రొగ్రాంలను తిలకించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు) పర్యవేక్షణలో, పట్టణ సీఐ దాడి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలు ముగియడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

యాచకులకు రగ్గుల పంపిణీ



యాచకులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దాడి రత్నాకర్



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న రత్నాకర్, భక్తులు

అనకాపల్లి: ప్రతీ వ్యక్తి తన సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజం కోసం వెచ్చిస్తే వచ్చే సంతృప్తి చాలా గొప్పగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. శనివారం రాత్రి రక్తచైతన్యకర్త, రాష్ట్ర ప్రాణదాత సేవా పురస్కార్ అవార్డు గ్రహీత కొమ్మోజు గణేష్ ఆధ్వర్యంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో రహదారులపై యాచకులకు రగ్గుల పంపిణీని స్థానిక పూడిమడక రహదారి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా చలికాలంలో అభాగ్యులకు రగ్గుల పంపిణీ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, 81వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరావు, ఉప్పల సాయి, ఉదయ్, జయంత్, ఫణి, దుర్గారావు, రాజు, విల్లూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో..
గవరపాలెం పెదరామస్వామి దేవాలయంలో శనివారం రాత్రి సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు పూజా సామగ్రిని దాడి రత్నాకర్ అందించారు. అంతకుముందు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం, అల్పాహారం అందించారు. కార్యక్రమంలో అర్చకులు బుజ్జి, రఘు, బాబీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత



ఉద్యోగ పత్రాలతో విద్యార్థులు, అనూషాసుబ్రహ్మణ్యం

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి చదువులో శ్రద్ధ కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాల డైరెక్టర్ కొణతాల అనూషాసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన యువతకు నియామక పత్రాలను అందించి, మాట్లాడారు. ఈ నెల 21న మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో 96 మంది పూర్వ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఇందులో 28 మందికి ఉపాధి కల్పిస్తూ నియామక పత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు దశల వారీగా జాబ్ మేళాలు నిర్వహించి, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన



కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్తల కొవ్వొత్తుల ప్రదర్శన

కశింకోట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మద్దతుదారులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమ వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకార్పు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం ప్రతినిధులు తనూజ, శ్యామల, కుమారి, యు.సత్యవతి, ఎస్.వెంకటలక్ష్మి, ఎస్.ఉమ, పి.సత్యవేణి, ఐద్వా నాయకురాలు డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయపుర అగ్రహారంలో కోవిడ్ కేసు నమోదు



బ్లీచింగ్ జల్లుతున్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని రాయపురం అగ్రహారంలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైనట్లు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని రోగిని సూచించారు. కాంటక్టుల సమాచారం గుర్తించడంతో పాటు వారి నుంచి శాంపిల్స్ సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సమూహాలకు దూరంగా ఉంటూ, మాస్కులు విధిగా ధరించాలన్నారు. కోవిడ్ లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

భవానీల భక్తి పారవశ్యం



శూలాలతో ఊరేగింపుగా వెళ్తున్న దీక్షాపరులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరం మార్గశిర శోభతో కళకళలాడుతోంది. తొలి రోజు నుంచి కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక భావనతో పులకిస్తున్నా యి. ఇప్పటికే బోనాల ఊరేగింపు, సారె సమర్పణ, సామూహిక కుంకుమార్చనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం భవానీ దీక్షాపరుల శూలాల సంబరాన్ని చూసిన వారంతా భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఇక్కడ కొలువుదీరిన కనక మహాలక్ష్మి అమ్మవారికి భవానీ మాలధారులు కుంకుమార్చన చేసి, శరణుఘోషతో హారతులిచ్చారు. ఉదయం నుంచి ఉపవాసదీక్ష చేపట్టిన భవానీ భక్తులు నాలుక, రెండు బుగ్గలు, శరీరంపై శూలాలు ధరించి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని కూడా ఊరేగించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కశింకోట మండలం ఎన్‌జీ పాలెం గ్రామానికి చెందిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. సబ్బవరం మండల కేంద్రంలో వాహన చోదకులకు ఆదివారం సాయంత్రం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని.. వాహనాలను వేగంగా నడపరాదని డ్రైవర్లకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు మీరిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ రంగనాథం, సిబ్బంది ఉన్నారు.